గొంతునొప్పి, జలుబు, ఒళ్లునొప్పులు..

- కోల్‌బెల్ట్‌లో విజృంభిస్తున్న వైరల్ ఫీవర్
- ఆసుపత్రుల్లో భారీగా పెరుగుతున్న పేషెంట్లు
- చర్యలు తీసుకుంటున్నాం: ఏసీఎంఓ అంబిక

సింగరేణిలో రోజువారీ అవుట్ పేషెంట్లు

గోదావరిఖని ఏరియా ఆసుపత్రి: **1350** మంది

ఆర్జీ–2 యైటింక్లయిన్‌కాలనీ డిస్పెన్సరీ: **210**మంది

ఆర్జీ–3 సెంటినరీకాలనీ డిస్పెన్సరీ : **174** మంది



సింగరేణి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్మిక కుటుంబాలు

గోదావరిఖని: గొంతునొప్పి, జలుబు, ఒళ్లు నొప్పులతో ఒక్కసారిగా వస్తున్న జ్వరాలు స్థానికులను కలవరపెడుతున్నాయి. భారీ వర్షాలు కురిసి తెరిపి ఇవ్వడంతో వాతావరణంలో మార్పులు వచ్చాయి. దోమలు, కీటకాలు, వైరస్‌వ్యాప్తితో వైరల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. దీంతో మంచం పడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఎక్కువగా చిన్నపిల్లలు వైరల్ జ్వరాల బారిన పడుతున్నారు. ఒళ్లునొప్పులు, గొంతునొప్పితో మొదలై 103 జ్వరం వస్తోంది. కొంచెం ఆలస్యమైతే రక్తకణాలు తగ్గుతున్నాయి. కార్మిక క్షేత్రంలో వారం రోజుల్లో జ్వరాల బారిన పడిన సంఖ్య పెద్ద సంఖ్యలో ఉన్నట్లు వైద్యులు పేర్కొంటున్నారు. రామగుండం రీజియన్‌లోని ఆర్జీవన్ ఏరియా గోదావరిఖని సింగరేణి ఏరియా ఆసుపత్రి, ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ, ఆర్జీ–3 ఏరియా సెంటినరీకాలనీల్లో రోజూ 1800 మందికి పైగా అవుట్ పేషెంట్లు పెరిగిపోయారు. వీరిలో చిన్న పిల్లలు, మహిళలు, కార్మికులు ఎక్కువగా ఉన్నారు.

సీజనల్ వ్యాధుల తీరే..

ప్రస్తుతం వస్తున్న జ్వరాలు సీజనల్ వ్యాధుల్లాగే ఉంటున్నాయి. అయితే గొంతునొప్పి, ఒళ్లునొప్పులు పెరిగి విపరీతమైన జ్వరం వస్తోంది. అంతే కాకుండా జాయింట్ పెయిన్ కూడా వస్తున్నట్లు బాధితులు చెప్పున్నారు. ఇలాంటి లక్షణాలు ఉంటే వెంటనే ఆసుపత్రుల్లో వైద్యులను సంప్రదించి మందులు వాడాలని సూచిస్తున్నారు.

ముందస్తు జాగ్రత్తలే మేలు..

వైరల్ ఫీవర్ బారిన పడకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. గోరువెచ్చని నీటిని తీసుకుంటూ, తేలికగా జీర్ణమయ్యే పదార్థాలు తీసుకోవాలని, మద్యం, మాంసం జోలికి వెళ్లొద్దంటున్నారు డాక్టర్లు.

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి



ఇటీవల వైరల్ ఫీవర్లు పెరిగిపోయాయి. చిన్నపిల్లలు ఎక్కువ జ్వరాల బారిన పడుతున్నారు. హెల్త్ ఆఫీసర్ ద్వారా ఇప్పటికే అన్నిగనులు, డిపార్ట్‌మెంట్లలో అవగాహన సదస్సులు నిర్వహించాం. దగ్గు, జలుబు, గొంతు నొప్పి, జ్వరంతో బాధపడుతూ కొంచెం చికిత్స ఆలస్యమైతే ప్లేట్‌లెట్స్ కూడా తగ్గుతున్నాయి. కార్మిక కుటుంబాలు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి.

– డాక్టర్ అంబిక, ఏసీఎంవో, సింగరేణి ఏరియా ఆసుపత్రి

విద్యార్థులను చదువుతోపాటు క్రీడల్లో ప్రోత్సహించాలి



ఖోఖో క్రీడల్లో గెలుపొందిన బాలికల జట్టు

రామగుండం: విద్యార్థులను పాఠశాల స్థాయి నుంచే చదువుతో పాటు క్రీడల్లో ప్రోత్సహించాలని ఎస్‌జీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణ్ అన్నారు. అంతర్గాం మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీలు శుక్రవారం ముగిసినట్లు ఎస్‌జీఎఫ్ జోన్, మండల స్థాయి కార్యదర్శి తుల శోభారాణి తెలిపారు. లక్ష్మణ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలని, ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని సూచించారు. కాగా అండర్–14, అండర్–17 విభాగంలో అథ్లెటిక్స్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించగా ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు జ్ఞాపికలు, బహుమతులు అందజేసినట్లు శోభారాణి పేర్కొన్నారు. గెలుపొందిన విద్యార్థులకు ఎంఈవో ఏకాంబరం జ్ఞాపికలు, ధృవీకరణపత్రాలు అందజేశారు. క్రీడా పోటీల పర్యవేక్షకులు, వ్యాయామ టీచర్లు కె.లక్ష్మణ్, విజయ్‌కుమార్, సోమశేఖర్, జావిద్, మాధవి, రమాదేవి, చంద్రశేఖర్, వినోద్, విద్యాసాగర్, రాజమౌళి, ధనలక్ష్మి, మౌనిక, నిర్మల పాల్గొన్నారు.

లక్ష్మీదేవి లక్షగాజుల కుంకుమ పూజ



పూజల్లో పాల్గొన్న సంధ్యారాణి, భక్తులు

గోదావరిఖనిటౌన్: శ్రావణ మాసం చివరి శుక్రవారం సందర్భంగా స్థానిక అడ్డగుంటపల్లిలోని ఆర్యవైశ్య భవన్‌లో మహిళలు వాసవీమాత లక్ష్మీదేవి లక్షగాజులు, కుంకుమ పూజ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. బీజేపీ రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి హాజరై పూజల్లో పాల్గొన్నారు. హారిక, మమత, అమూల్య, రేఖ, శరణ్య, స్వరూప, కల్యాణి, నటరాజ శేఖర్, మురళి, శ్రీనివాస్, వెంకటేశ్వర్, శ్రీరామ్ పాల్గొన్నారు.

రైతులకు సరిపడా యూరియా సప్లై చేయాలి

మంథని: చిన్న, సన్నకారు రైతులకు సరిపడా యూరియా సప్లై చేయాలని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చందుపట్ల సునీల్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంథనిలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం అన్ని రాష్ట్రాలకు డిమాండ్‌కు తగినట్లుగా సరఫరా చేస్తున్నప్పటికీ రాష్ట్రంలో మాత్రం అడ్డదారి పట్టించి రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కొండపాక సత్యప్రకాశ్, అసెంబ్లీ కోకన్వీనర్ నాంపెల్లి రమేశ్, పట్టణ అధ్యక్షుడు సబ్బని సంతోష్, నాయకులు నారమల్ల కృష్ణ, అయింటి మల్లేశ్, బూడిద తిరుపతి, కోరబోయిన మల్లికార్జున్ పాల్గొన్నారు.

బీఎంఎస్ ఆధ్వర్యంలో ఆందోళన



ఆందోళన చేస్తున్న బీఎంఎస్ నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: దేశవ్యాప్త బొగ్గు పరిశ్రమ సింగరేణి పరిరక్షణ, కార్మిక హక్కుల సంరక్షణ కోసం చేపట్టిన ఆందోళనలో భాగంగా శుక్రవారం ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ తెలంగాణ చౌరస్తాలో బీఎంఎస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య నాయకులతో కలిసి ఆందోళన చేశారు. సత్తయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, సింగరేణి యజమాన్యం కార్మికుల సమస్యల పరిష్కారం, నూతన బొగ్గు గనుల ఏర్పాటు, కార్మికుల సంక్షేమ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీఎంఎస్ నాయకులు కుమారస్వామి, ఆర్జీ–2 వైస్ ప్రెసిడెంట్ గట్టు శ్రీనివాస్, శివాజీ, నరేశ్, నర్సయ్య, లింగం నాయక్ పాల్గొన్నారు.

ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మిక సంఘాల నిరసన

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు కాంట్రాక్టు కార్మిక సంఘాల నాయకులు శుక్రవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ప్రాజెక్టు లేబర్ గేట్ రోడ్‌లో కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనలో పలువురు నాయకులు పాల్గొని మాట్లాడారు. యాజమాన్యం కార్మిక సంఘాలతో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు పలు అంశాలను నేటి వరకు అమలు చేయకపోవడం ఏంటని ప్రశ్నించారు. జేఏసీ కార్మిక సంఘాల నాయకులు చిలుక శంకర్, నాంసాని శంకర్, రాజమల్లయ్య, భూమయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జిల్లా ఆసుపత్రిలో మెరుగైన వైద్యసేవలు

సుల్తానాబాద్: జిల్లా ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 100 పడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేసుకున్న తర్వాత స్థల సమస్య తగ్గుతుందన్నారు. సామర్థ్యానికి మించి పనిచేస్తున్న సిబ్బందికి ప్రజలు సహకారం అందించాలని కోరారు.

సంక్షిప్త వార్తలు

• నవరాత్రులు ప్రశాంతంగా జరుపుకోవాలి

సుల్తానాబాద్: గణేశ్ నవరాత్రులు ప్రశాంతంగా జరుపుకోవాలని పెద్దపల్లి డీసీపీ కరుణాకర్ కోరారు. జిల్లా కేంద్రంలోని ఎంబీ గార్డెన్‌లో శుక్రవారం రాత్రి శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఆర్డీవో గంగయ్య, ఏసీపీ గజ్జి కృష్ణ, డీఎఫ్‌వో అనిల్, డీఎల్‌పీవో వేణుగోపాల్, మున్సిపల్ కమిషనర్ రమేశ్, పెద్దపల్లి, సుల్తానాబాద్ సీఐలు ప్రవీణ్‌కుమార్, సుబ్బారెడ్డి, అనిల్‌కుమార్, ఎస్సైలు లక్ష్మణ్‌రావు, మల్లేశం పాల్గొన్నారు.

• మైనర్లకు వాహనాలిస్తే కఠిన చర్యలు

గోదావరిఖని: మైనర్‌లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి హెచ్చరించారు. స్థానిక తిలక్‌నగర్ చౌరస్తాలో శుక్రవారం రాత్రి ట్రాఫిక్ రూల్స్, సైబర్‌నేరాలపై అవగాహన కల్పించారు. ఎస్‌ఐ రమేశ్, భూమేశ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

• కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ రాజకీయం

మంథని: రాష్ట్రంలోని బీడు భూములకు సాగునీరు అందించి సస్యశ్యామలం చేసిన కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ సర్కార్ రాజకీయం చేస్తోందని బీఆర్‌ఎస్ మండల నాయకులు ఆరోపించారు. మంథనిలోని రాజగృహలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పార్టీ మండల అధ్యక్షుడు ఏగోళపు శంకర్‌గౌడ్, నాయకులు పుప్పాల తిరుపతి, కొండ రవీందర్, పెగడ శ్రీనివాస్, గొబ్బూరి వంశీ, కాయితి సమ్మయ్య, కుమార్, ఆసిఫ్‌ఖాన్ పాల్గొన్నారు.

• సమస్యల పరిష్కారానికే సీపీఎం పోరాటం

మంథని: ప్రజా సమస్యల పరిష్కారానికే సీపీఎం పోరాటాలు చేస్తుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.నాగయ్య అన్నారు. మంథని మండలం సూరయ్యపల్లి, కాకర్లపల్లి గ్రామాల్లో సీపీఎం బృందం పర్యటించి ప్రజా సమస్యలను అధ్యయనం చేశారు. రెడ్డిచెరువు ప్రభుత్వ భూమిని పరిశీలించి కాకర్లపల్లి దళితులతో పాదయాత్ర నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలో ప్రజాసంఘాల కార్యాలయం ప్రారంభించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వై.యాకయ్య, కార్యదర్శివర్గ సభ్యులు వేల్పుల కుమారస్వామి, జిల్లా కమిటీ సభ్యులు బూడిద గణేశ్, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

• సీపీఎస్ విధానం రద్దు చేయాలి

మంథని: ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేసే ప్రతీ ఉద్యోగి భద్రత ప్రభుత్వానిదేనని, సీపీఎస్ విధానం రద్దు చేయాలని సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లింగమొల్ల సుదర్శన్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలనే డిమాండ్‌తో చేపట్టిన ఉద్యోగుల ఆత్మగౌరవ సభ పోస్టర్‌ను శుక్రవారం మంథనిలో ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగవెల్లి ఉపేందర్, రాష్ట్ర కోశాధికారి మారం లింగారెడ్డి, మారెపల్లి నాగరాజు, ప్రకాశ్, రాముడు, లింగం శ్రీనివాస్ పాల్గొన్నారు.

• వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో కుంకుమ పూజలు

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా శుక్రవారం మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. అంతకు ముందు సంతోషిమాతకు, గణపతికి ప్రత్యేక పూజలు చేశారు. వాసవి మాతకు తులసీదళాల మాల వేశారు. అనంతరం వాసవి మాత పారాయణం చేశారు.

• బశెట్టికుంట పూడ్చివేతపై వినతి

ఓదెల: ఓదెలలో తారురోడ్డు నిర్మాణంలో బశెట్టికుంటను కాంట్రాక్టర్ ఒకవైపు పూడ్చివేయగా స్థానిక మత్స్యకార్మికులు తహసీల్దార్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు.

• ఉచిత కంటి వైద్య శిబిరం

గోదావరిఖనిటౌన్: లయన్స్ క్లబ్ ఆఫ్ స్ఫూర్తి గోదావరిఖని ఆధ్వర్యంలో కరీంగనగర్ రేకుర్తి కంటి ఆసుపత్రి సౌజన్యంతో స్థానిక అశోక్‌నగర్‌లోని ఉప్పర సంఘం భవన్‌లో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యులు కంటి రోగులను పరీక్షించి 42 మందిని ఆపరేషన్ నిమిత్తం రేకుర్తి కంటి ఆసుపత్రికి తరలించారు.

• ఎస్జీఎఫ్ క్రీడలు ప్రారంభం

జ్యోతినగర్: ఎస్‌జీఎఫ్ క్రీడాపోటీలు ఉల్లాసంగా ప్రారంభమయ్యాయి. ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్‌లోని జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో శుక్రవారం పశ్చిమ మండల స్థాయి పోటీలు ఎంఈవో మల్లేశం ప్రారంభించారు. జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం జయరాజు, వ్యాయామ ఉపాధ్యాయులు విజయకుమార్, జావిద్, భాస్కర్, రాము, ప్రేమ్‌కుమార్, రాజేశ్వరి, సరస్వతి పాల్గొన్నారు.

ఓదెల: మండలంలోని కనగర్తి దాసరి పద్మహన్మయ్య హైస్కూల్‌లో మండలస్థాయి ఎస్జీఎఫ్ క్రీడలను ఎంఈవో ఎర్ర రమేశ్ ప్రారంభించారు. కనగర్తి ఇన్‌చార్జి హెచ్‌ఎం రజాక్‌మియా, వైద్యురాలు మాధవిరెడ్డి, పీఈటీలు వ్యాయామ ఉపాధ్యాయులు హరికృష్ణ, రాజేందర్‌రెడ్డి, సదానందం, స్వరూప, కుమార్, విష్ణు పాల్గొన్నారు.

జూలపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత బాలుర పాఠశాలలో ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడాపోటీలను ఎంఈవో సరస్వతి ప్రారంభించారు. పోటీలను స్కూల్ కాంప్లెక్సు హెచ్‌ఎంలు లక్ష్మయ్య, రవీందర్, డీవైఎస్‌వో సురేశ్, పెటా టీఎస్, జీఎస్ డి.రమేశ్, పీడీలు మహేందర్, శ్రీనివాస్, కవిత, నాగరాజు నిర్వహించారు.

గోదావరిఖనిటౌన్: ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో రామగుండం మండల (తూర్పు) క్రీడలను రామగుండం ఎంఈవో జింక మల్లేశం స్థానిక జీఎం కాలనీ గ్రౌండ్‌లో శుక్రవారం ప్రారంభించారు. ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ లక్ష్మణ్, మండల కన్వీనర్ రమాదేవి, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

• ప్రపంచ జానపద కళల దినోత్సవం

గోదావరిఖనిటౌన్: ప్రపంచ జానపద కళల దినోత్సవాన్ని గోదావరి కళా సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక సింగరేణి ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం స్ఫూర్తి భవన్‌లో ఘనంగా నిర్వహించారు. కోలాటం, డప్పు, లంబాడి కళాకారులను సన్మానించారు. సంఘం అధ్యక్షుడు రమణయ్య, రాజమౌళి, అంజలి, శ్రీనివాస్, మాధవి, జగ్గయ్య, వెంకటేశ్వరరావు, రాజేశ్వరరావు, లక్ష్మణ్, సుజాత, లక్ష్మీదేవి, రాజేశ్వరి, సంపత్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న వైద్యులు

సుల్తానాబాద్‌రూరల్: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దరిచేరవని గర్రెపల్లి పీహెచ్‌సీ వైద్యులు ఉదయ్‌కుమార్ అన్నారు. మండలంలోని కనుకులలో ఒకరికి డెంగీ పాజిటివ్ రాగా శుక్రవారం వైద్య సిబ్బంది ఆ ఏరియాలో జ్వరం సర్వే నిర్వహించారు. 50 ఇళ్లల్లో వైద్య పరీక్షలు చేశారు. అనంతరం వైద్యులు మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

బల్దియాలో డ్రైడే ఫ్రైడే



నిల్వ నీటిని పారబోయిస్తున్న డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో 100రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఇళ్లలో, ఇంటి పరిసరాలల్లో దీర్ఘకాలంగా నిల్వ ఉన్న నీటిని డిప్యూటీ కమిషనర్ దగ్గరుండి పారబోయించారు. స్థానిక గోదావరిఖని ప్రధాన చౌరస్తా సమీపంలోని ఐడీఎస్ఎంటీ షాపింగ్ కాంప్లెక్స్ వెనుక ఉన్న మరుగుదొడ్డి ఆవరణం శుభ్రం చేయించారు. రమేశ్‌నగర్‌లో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులతో కళాజాత ప్రదర్శన ఏర్పాటు చేశారు. దోమల నియంత్రణ, తడి, పొడి చెత్త వేరు చేయడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో నగర పాలక సంస్థ వార్డు ఆఫీసర్లు, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ మధుకర్, ఎంఐఎస్ ఆపరేటర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు



ఒడిబియ్యం పోస్తున్న మహిళలు

యైటింక్లయిన్‌కాలనీ: శ్రావణమాసం చివరి శుక్రవారం కావడంతో యైటింక్లయిన్‌కాలనీ శ్రీఅయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు దేవ్‌ప్రకాశ్ పాండే స్వామివారికి పంచామృతాలతో అభిషేకం చేశారు. మహిళలు అమ్మవారికి ఒడిబియ్యంతో పాటు గాజులు, పండ్లు, పూలు సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, సతీమణి లక్ష్మి, మహిళలు రమ, వనజ, రాధిక, శ్యామల, లక్ష్మి, రమాదేవి, స్రవంతి పాల్గొన్నారు.

ఆయిల్‌పాం సాగు రైతులకు చెక్కులు అందజేత

ముత్తారం: మండలంలోని అడవిశ్రీరాంపూర్, ముత్తారంలో ఆయిల్‌పాం సాగు పంట చేతికి వచ్చిన గెలలను అమ్మారు. కాగా వచ్చిన చెక్కులను ముత్తారంలో రైతులు నాంసాని సమ్మయ్య, కల్యాణపు రాజమల్లుకు శుక్రవారం మండల వ్యవసాయాధికారి అనూష, హార్టికల్చర్ ఆఫీసర్ జ్యోతి అందజేశారు. సమ్మయ్యకు 7.8 టన్నులకు రూ.1.48లక్షలు, రాజమల్లుకు 7.2 టన్నులకు రూ.1.33లక్షల విలువ గల చెక్కులు అందచేశారు. ఆయిల్ పాం సాగుతో కలిగే లాభాలు రైతులకు వివరించారు. ఏఈవో హారిక, ఆయిల్‌ఫాం ఫీల్డ్ ఆఫీసర్ అజయ్, రంజిత్ పాల్గొన్నారు.

శ్రీసంతోషిమాత ఆలయంలో పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

రామగుండం: శ్రావణమాసం చివరి శుక్రవారం కావడంతో పట్టణంలోని శ్రీసంతోషిమాత ఆలయానికి భక్తుల రద్దీ పెరిగింది. అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. మహిళలు అమ్మవారి ఆలయంలో నోములు, వ్రతాలు చేసుకొన్నారు. మాజీ కార్పొరేటర్ కౌశిక లత అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారి కమ్మల నాగేంద్రశర్మ, కమ్మల చంద్రశేఖర్‌శర్మ ఆశీర్వచనం అందించారు.

అక్రమాలకు పాల్పడిన అధికారులను సస్పెండ్ చేయాలి

కోల్‌సిటీ: నగరపాలక సంస్థ పరిధి గోదావరిఖని చౌరస్తాలోని పోచమ్మ మైదానం స్థలం నాడు ఎలా సక్రమమైందో.. నేడు ఎలా అక్రమమో సంబంధిత అధికారులు తెలపాలని బీజేపీ రామగుండం అసెంబ్లీ కోఆర్డినేటర్ కొండపర్తి సంజీవ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఇటీవల పోచమ్మ మైదానంలో నిర్మించిన కట్టడాలకు అనుమతి సక్రమమేనని గతంలో భూమిని రిజిస్ట్రేషన్ చేసిన సబ్ రిజిస్ట్రార్‌తోపాటు వాల్టాయాక్ట్‌లో అక్రమ బోర్లకు అనుమతి ఇచ్చిన రెవెన్యూ అధికారులు, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని కోరారు.

విద్యుత్ అధికారుల పొలంబాట

పెద్దపల్లిరూరల్: మండల పరిధిలోని తుర్కల మద్దికుంటలో శుక్రవారం విద్యుత్ అధికారులు పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యల గురించి తెలుసుకుని పరిశీలించారు. పెద్దపల్లి డివిజన్ ఇంజనీరు ఆపరేషన్ దాసరి తిరుపతి, డీఈ బాలయ్య, ఏడీఈ రాజ్‌కుమార్, బొంపల్లి ఏఈ రవిచంద్ర పాల్గొన్నారు.



రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ఎల్లంపల్లి ప్రాజెక్టు రహదారి వీధి దీపాలు వెలగడం లేదు. ప్రాజెక్టు ప్రారంభంలోని స్వాగత బోర్డు నుంచి అవతలి వైపు గుడిపేట వరకు రహదారికి ఇరువైపులా ఉన్న స్ట్రీట్ లైట్స్ వెలగకపోవడంతో రాత్రివేళల్లో ప్రాజెక్టు ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారు. వర్షాకాలంలో ప్రాజెక్టు అందాలు తిలకించేందుకు పర్యాటకులు వస్తుంటారు. వీధిదీపాలు లేకపోవడంతో సాయంత్రం వరకే అంధకారం నెలకొనడంతో ప్రజలు అసహనానికి గురవుతున్నారు. వీధిదీపాలు ఏర్పాటు చేయాలని పర్యాటకులు, వాహనదారులు, ఉద్యోగులు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

సింగరేణి ఉద్యోగులకు క్వార్టర్ల కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

రామగిరి: ఆర్జీ–3, ఏపీఏ ఏరియాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు శుక్రవారం జీఎం నరేంద్ర సుధాకర్‌రావు ఆదేశాల మేరకు క్వార్టర్ల కౌన్సెలింగ్ నిర్వహించారు. 169 ఖాళీ క్వార్టర్లు ఉండగా ఫ్రెష్ అలాట్‌మెంట్, చేంజ్ ఆఫ్ క్వార్టర్ కోసం 65 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారని ఎస్‌వోటూ జీఎం ఎం.రాంమోహన్ తెలిపారు. 20 మంది ఉద్యోగులు హాజరై 15 మంది క్వార్టర్లు ఎంపిక చేసుకున్నారని, వారికి త్వరలోనే అలాట్‌మెంట్ లెటర్స్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు ఎం.రాంచంద్రారెడ్డి, కోట రవీందర్‌రెడ్డి, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, మెడికల్ సూపరింటెండెంట్ కళ్యాణ్ చక్రవర్తి, డీవైపీఎం వి.సునీల్‌ప్రసాద్, సివిల్ విభాగం అధికారి ఫణీంద్ర, ఎస్టేట్ విభాగం అధికారి మణిదీప్‌రెడ్డి, క్వార్టర్ల విభాగం సిబ్బంది మహేందర్, దాసు శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో గుర్తింపు సంఘాలు విఫలం



మాట్లాడుతున్న యాదగిరి సత్తయ్య

రామగిరి: సొంతింటి కల నెరవేర్చలేకపోవడం, ఇన్‌కం ట్యాక్స్ రద్దు చేయించక పోవడం, మారుపేర్ల సమస్య పరిష్కరించడంలో గుర్తింపు ప్రాతినిధ్యం వహిస్తున్న సింగరేణి కార్మిక సంఘాలు విఫలమయ్యాయని బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య అన్నారు. ఏపీఏ గనిలో ఏరియా ఉపాధ్యక్షుడు ఆర్కాల ప్రసాద్‌గౌడ్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చలేక, మాయమాటలతో మభ్యపెట్టడానికి ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. ప్రధాన కార్యదర్శి యతిపతి సారంగపాణి, డిప్యూటీ జనరల్ సెక్రటరీ పొన్నమనేని వేణుగోపాలరావు, కేంద్ర కార్యదర్శి మాదాసి రవీందర్, బ్రాంచ్ కార్యదర్శి రౌతు రమేశ్, కార్యదర్శి, పిట్ సెక్రటరీ పాక కృష్ణ, రమేశ్, సురేశ్, మహేశ్, సంతోష్, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఉపాధి పనుల జాతరతో గ్రామాల్లో అభివృద్ధి



మంథనిరూరల్: పనులు ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్

మంథనిరూరల్: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ఉపాధి పనుల జాతరతో బాటలు వేస్తోందని పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్ అన్నారు. మంథని మండలం పుట్టపాకలో ఉపాధి పనుల జాతరను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పనుల జాతర 2025 ద్వారా పల్లెల్లో అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. అనంతరం గ్రామ ప్రత్యేక అధికారి, ఎంపీవో అనిల్‌రెడ్డిని సన్మానించారు. ఏపీవో సదానందం, కార్యదర్శి డేగ సరిత, ఫీల్డ్ అసిస్టెంట్ కొత్త ప్రవీణ్ పాల్గొన్నారు.

ఎలిగేడు: మండలంలోని అన్ని గ్రామాల్లో పనుల జాతరపై గ్రామసభలు నిర్వహించారు. పశువుల పాక నిర్మాణాలు, ఈజీఎస్ రోడ్లు, గొర్రెల షెడ్లు, ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గులు పోయడం వంటి కార్యక్రమాలను పనుల జాతరలో ప్రారంభించారు. ఇప్పటివరకు 12 పనులు గుర్తించి రూ.9.89లక్షలు అంచనాలతో పనులు ప్రారంభించినట్లు ఏపీవో సదానందం తెలిపారు. ఎంపీడీవో భాస్కర్‌రావు, ఎంపీవో కిరణ్, టీఏ రంజిత్, కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

జూలపల్లి: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో పనుల జాతర గ్రామసభలు నిర్వహించారు. మండలానికి 66 పనులు మంజూరు కాగా, పీఆర్ శాఖ నుంచి 6 పనులకు రూ.56లక్షలు, ఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో 60 పనులకు రూ.కోటి90 లక్షల నిధులు మంజూరయ్యాయి. జూలపల్లిలో నిర్వహించిన గ్రామసభలో ఎంపీవో శేషయ్య సూరి పాల్గొని పనులు గుర్తించారు. కార్యదర్శులు మెహిమిన్, విజయ్‌కుమార్, భానుప్రసాద్, ఉమాపతిరెడ్డి పాల్గొన్నారు.

ముత్తారం: మండలంలోని మైదంబండలో పనుల జాతరపై గ్రామసభ నిర్వహించారు. ఎంపీడీవో సురేశ్, డీపీఎం రవి, ఐకేపీ ఏపీఎం స్వరూప, సీసీ తిరుపతి పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని వివిధ గ్రామాల్లో పంచాయతీల్లో పనుల జాతర గ్రామసభలు నిర్వహించారు. కూనారంలో 100రోజుల ఉపాధిహామీ పనులు పూర్తి చేసిన గట్టయ్య, జూపాక సతీశ్, పంచాయతీ ఉత్తమ మల్టీపర్పస్ వర్కర్ కె.మల్లయ్యను ఎంపీడీవో పూర్ణ చందర్ సన్మానించారు. ఎంపీవో ఆరిఫ్ హుస్సేన్, ఏపీవో మంజుల పాల్గొన్నారు.

రామగిరి: మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామసభ నిర్వహించి పనులు ప్రారంభించారు. ఎంపీడీవో శైలజారాణి, ఎంపీవో ఉమేశ్, ఈసీ మౌనిక, సీనియర్ అసిస్టెంట్ రామకృష్ణ, జూనియర్ అసిస్టెంట్‌లు షరీఫ్, కవిత పాల్గొన్నారు.

పాలకుర్తి: మండలవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో పనుల జాతర–2025 ప్రారంభం కార్యక్రమం నిర్వహించారు. కన్నాలలో క్యాటిల్ షెడ్, పాలకుర్తిలో గోట్ షెడ్ నిర్మించుకున్న లబ్ధిదారులకు ఉపాధిహామీ పథకం ద్వారా మంజూరైన నిధుల చెక్కులు పంపిణీ చేశారు. ఎంపీడీవో రామ్మోహనచారి, ఎంపీవో సుదర్శన్, ఏపీవో కొంరయ్య పాల్గొన్నారు. బామ్లానాయక్‌తండా పంచాయతీ పరిధి రాజీవ్‌తండాలో వాటర్‌ట్యాంక్ మరమ్మతు కోసం రూ.50వేలు నిధులు మంజూరు కాగా గ్రామ మాజీ ఉపసర్పంచ్ బదావత్ జ్యోతి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి అఖిలతో కలిసి పనులు ప్రారంభించారు.

కమాన్‌పూర్: ఉపాధిహామీ పథకంలో చేపట్టే పనులను వినియోగించుకోవాలని ఎంపీడీవో లలిత అన్నారు. పనుల జాతర కార్యక్రమాన్ని మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహించారు. ఉపాధిహామీ కూలీలు, పారిశుధ్య కార్మికులను ఎంపీడీవో సన్మానించారు. డీపీఎం రజిత, ఏపీఎం పద్మ, ఎంపీవో మారుతి పాల్గొన్నారు.